# అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

- తాసీల్దార్ శ్రీనివాస్‌రావు


మఠంపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న తాసీల్దార్ మంగా

నూతనకల్, డిసెంబర్ 13 : పద్దెనిమిదేండ్లు నిండిన యువతీయువకులను ఓటర్లుగా నమోదు చేయాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశమై ఈ మేరకు దిశా నిర్దేశం చేశారు. మృతి చెందిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. ఓటరు కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. డిసెంబర్ 30 వరకు అవకాశం ఉన్నందున అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తాసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన బూత్ లెవల్, రెవెన్యూ అధికారుల సమావేశంలో తాసీల్దార్ మంగా మాట్లాడుతూ అర్హులైన యువతీయువకులను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఓటరు కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

- గ్యాస్ కనెక్షన్ కేవైసీకి గడువు లేదు
- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

సూర్యాపేట, డిసెంబర్ 13 : గ్యాస్ వినియోదారులు కేవైసీ కోసం ఇబ్బందులు పడవద్దని కేవైసీ నమోదుకు చివరి తేదీ ఏమి లేదని అదనపు కలెక్టర్ ఎ. వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్, సివిల్ సప్లయ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ వినియోగదారులు ఎలాంటి అపోహలు నమ్మొద్దని కోరారు. కేవైసీ పేరుతో వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేవైసీ అనేది ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే సాధారణ ప్రక్రియ అని చెప్పారు. రూ.500కు సిలిండర్ పథకంపై ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి విధి విధానాలు రాలేదని చెప్పారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ మోహన్‌బాబు, ఏఎస్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో లక్ష్యాలను చేరుకోవాలి


గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

బొడ్రాయిబజార్ : దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంపొందించుకుని జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించే జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులు తమలోని అవయవ లోపాన్ని పక్కన పెట్టి ఆలోచిస్తే దేన్నైనా సాధించగలరని తెలిపారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు ఎంతో చైతన్యమై తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, దివ్యాంగుల ఓటింగ్ శాతం 95.95 శాతం నమోదు కావడమే నిదర్శనమన్నారు. దివ్యాంగుల కోరిక మేరకు సదరంలో అవకతవకలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమాధికారి జ్యోతి పద్మ, సూపరింటెండెంట్ హుస్సేన్‌నాయక్, జూనియర్ అసిస్టెంట్ సంజీవ, ఎఫ్ఆర్‌ఓ వినోద్‌కుమార్, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.నయీమ్, బధిరుల పాఠశాల కరస్పాండెంట్ మదనాచారి పాల్గొన్నారు.

# వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు

- జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కృష్ణయ్య


విద్యార్థుల ట్రైనింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కృష్ణయ్య

నడిగూడెం, డిసెంబర్ 13 : వృత్తి విద్యతో ఉపాధి లభిస్తుందని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి జానపాటి కృష్ణయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్య కోర్సుల విద్యార్థుల ఆన్ ద జాబ్ ట్రైనింగ్ శిక్షణను పరిశీలించి మాట్లాడారు. స్వయం ఉపాధి కల్పన కోసం ఇంటర్ బోర్డు నిర్వహిస్తున్న ఓజేటీ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మెరుగైన ఫలితాల కోసం అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య, అధ్యాపకులు శ్రీధర్, కృష్ణ, మహేశ్, వీరన్న, మదార్, నగేశ్, ధనుంజయ్ పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో ఆరోగ్యం

నడిగూడెం, డిసెంబర్ 13 : నిత్యం చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని ప్రకృతి వ్యవసాయ సామాజిక కార్యకర్త మెలుగూరి గోపి అన్నారు. బుధవారం మండలంలోని వల్లాపురంలో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై కలిగే లాభాలపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాగులు, కొర్రలు, అండు కొర్రలు, సామలు, అరికలు, జొన్నలు తదితర చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకుంటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. 2023 ను ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో రైతులు అచ్చిరెడ్డి, వెంకన్న, రామకోటి, నారాయణ పాల్గొన్నారు.

# కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె


సమ్మెలో పాల్గొన్న తపాలా ఉద్యోగులు

నూతనకల్, డిసెంబర్ 13 : ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి పెన్షన్‌తో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తపాలా ఉద్యోగులు జీడీఎస్‌పీజేసీఏ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె కొనసాగుతున్నది. బుధవారం మండల కేంద్రంలోని పోస్టల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు సమ్మెను కొనసాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, శ్రీనివాస్, రాములు, వీరయ్య, నాగన్న పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్


పల్లేటి లక్ష్మణ్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 13 : ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పల్లేటి లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు లక్ష్మణ్‌కు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన కార్యవర్గానికి, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ టీఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా సునీత

ఎమ్మార్పీఎస్ టీఎస్ సూర్యాపేట పట్టణ మహిళా అధ్యక్షురాలిగా పిడమర్తి సునీత నియమితులయ్యారు. ఈ మేరకు నియోజక వర్గ ఇన్‌చార్జి పాలడుగు పరశురాములు బుధవారం ఆమెకు నియామక పత్రం అందజేశారు.

# క్రీడా మైదానం కబ్జాకు గురికాకుండా చూడాలి

- తాసీల్దార్‌కు మోతె యూత్ అసోసియేషన్ సభ్యుల వినతి


తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మోతె యూత్ అసోసియేషన్ సభ్యులు

మోతె, డిసెంబర్ 13 : మోతె మండల కేంద్రంలో ప్రభుత్వం క్రీడా ప్రాంగణానికి కేటాయించిన స్థలం కబ్జాకు గురి కాకుండా చూడాలని కోరుతూ యూత్ అసోసియేషన్ సభ్యులు బుధవారం తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. క్రీడా స్థలం తమదని కొందరు పేర్కొంటూ ఆక్రమించుకునేందుకు చూస్తున్నట్లు చెప్పారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లచ్చుమళ్ల రాజు, ఇండ్ల అనీల్, లచ్చుమళ్ల అనీల్, అప్పల గణేశ్, దోసపాటి నరేశ్, గురిజాల మహేశ్, బొడ్డు సందీప్, గురిజాల రాజు, అండెం నాగరాజు, గురిజాల శ్రీనివాస్, పుల్లూరి గోపి పాల్గొన్నారు.

## రైతు బంధుకు దరఖాస్తులు

మునగాల, డిసెంబర్ 13 : మునగాల రెవెన్యూ పరిధిలోని గ్రామ రైతులు రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ ఉప్పయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా పట్టా మార్పిడి అయి పాస్ పుస్తకం పొందిన రైతులు యాసంగి రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు బంధు దరఖాస్తుతో పాటు భూమి పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్‌ను శుక్రవారంలోగా అందించాలని పేర్కొన్నారు.

## పద్మశాలి సేవా సంఘం నూతన కమిటీ


పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

కోదాడటౌన్, డిసెంబర్ 13 : పద్మశాలి సేవా సంఘం పట్టణ నూతన కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోలి నాగరాజు, సెక్రటరీగా పిండిపోలు శ్రీనివాస్, కోశాధికారిగా చిట్టిప్రోలు గిరి ప్రసాద్, మహిళా అధ్యక్షురాలిగా కొంగర మాధవి, సెక్రటరీగా చిట్టిప్రోలు లక్ష్మీకాంతం, కోశాధికారిగా నక్క ఉమను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సంగిశెట్టి గోపాల్, నియోజక వర్గ అధ్యక్షుడు కొంగర నరసింహారావు, మండల అధ్యక్షుడు నక్క చంద్రం పాల్గొన్నారు.

## విశ్వనాథుడి ఆలయంలో ఆకాశ దీప పూజ


ఆకాశ దీపానికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకుడు వీరభద్రశర్మ

బొడ్రాయిబజార్, డిసెంబర్ 13 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి దేవాలయంలో బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు ఆకాశ దీపం పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసం మొదటి రోజున ప్రారంభమైన ఆకాశ దీపం నెల రోజులు పూజలందుకుని బుధవారంతో ముగిసినట్లు తెలిపారు.

## 17న సత్యనారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభం

- ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగయ్య

నూతనకల్, డిసెంబర్ 13 : ఈ నెల 17న మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కామ్రేడ్ గుణగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెద్దింటి రంగారెడ్డి, దేసోజు మధు, సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్న అశోక్, గడ్డం పాపయ్య, మల్లారెడ్డి, పరమేశ్, బుచ్చయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I AFIFA ANJUM W/O AZEEM MAHAMMAD R/o 22-27, BABANSAHEB GUDEM, NAKREKAL TOWN CHANGED MY NAME TO MISKIN MD VIDE AFFIDAVIT DATED 12-12-2023 SWORN BEFORE NOTARY M LENIN BABU
NLG-

FLAT FOR SALE
★HAYATHNAGAR: Walkable Distance, Vijayawada Highway, Beside Bus Stop, Sup. Luxurious 3 BHK Flats, Ready to move, 2 side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-314488

WANTED
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638